428068901

కట్టెలందున నిప్పులు కలుగునట్లు
తిలల యందున తైలంబు వెలయు పగిది
ఎందు జూచిన దైవంబె ఇమిడి యుండు
విశ్వసించుడు దీని విద్యార్థులార!

విద్యార్థులారా!

సర్వం బ్రహ్మమయం జగత్ భగవంతునితో సంబంధము లేని పదార్థము జగత్తులో కానరాదు. జగత్తంతయు బ్రహ్మస్వరూపమే. ఐతే యిట్టి సత్యాన్ని గుర్తించుకునే శక్తులు అందరియందు లేవు. ప్రతి కట్టెయందు అగ్ని వున్నది. అట్లని ఒకలాతో కట్టెలు తెచ్చి ఒక పాత్రలో నీరు బియ్యము పోసి ఆ కట్టెలపైన పెట్టినప్పుడు అది అన్నమగునా? అగ్నికి అంతర్బహిర్గతములనే స్థితులు రెండుంటున్నవి. అంతరగ్ని బహిరగ్ని. కంటికి కనుపించక లోపల వెలుగుతున్న అగ్ని అంతరగ్ని. అట్టి అగ్ని వుండియు దేనిని కాల్చలేదు. ఐతే బహిర్గతమైన అగ్ని స్వరూపాన్ని ధరించి సర్వమును భస్మము గావించుతుంది. అదే విధముగానే భగవంతుడు సర్వత్రా వుండినప్పటికిని దాన్ని సాక్షాత్కరింప జేసుకొనే శక్తి సామర్థ్యములు ఒక్కొక్కరికి బహిర్ముఖముగా ఒక్కొక్కరికి అంతర్ముఖముగా వుంటుంటాయి. జగత్తునందలి ప్రతి పదార్థము జడచైతన్యములన్నీ కూడను భగవంతుని గర్భమునందే వుంటున్నవి. తృణము మొదలుకొని పర్వతము వరకు, బిందువు మొదలుకొని సింధువు వరకు, పరమాణువు మొదలుకొని పరబ్రహ్మము వరకు వ్యాపించిన తత్వం ఒక్కటే. ఏకత్వములో కూడిన యిట్టి దివ్యత్వాన్ని అందరు సాక్షాత్కరింప జేసుకోలేరు.

జగత్తంతా పారాయణమనే చెప్పవచ్చు. భక్తుని భావములు, భగవంతుని ప్రేమకిరణములు రెండు కూడినప్పుడే యిది సాక్షాత్కారమౌతుంది. భగవంతుడు కలడు కలడు అనే ఆస్తికునియందు, భగవంతుడు లేడు లేడు అనే నాస్తికునియందు యీ ఆధ్యాత్మిక అగ్ని ప్రజ్వరిల్లుతూనే వున్నది. కలడన్నవాని హృదయమునందు ప్రేమభావములు ప్రకటితములౌతూ వుంటాయి. లేడన్నవాని హృదయమునందు కూడను ప్రేమభావములు ప్రకటితమౌతూ వుంటాయి. ఐతే ఆస్తికుని యొక్క ప్రేమభావములు పరమాత్మపైన ప్రసరిస్తూ వుంటాయి. నాస్తికుని ప్రేమభావములు ప్రకృతిపైన ప్రసరిస్తూ వుంటాయి. ప్రాకృత విషయములందు తన ప్రేమతత్వాన్ని యిమిడ్చినప్పుడు బంధనకు కారణమౌతున్నాడు. తనప్రేమ తత్వమును పరతత్వముపైన ప్రసరింపజేసినప్పుడు యితడే ముక్తుడౌతున్నాడు. బంధమోక్షములకు ప్రేమతత్వం ఒక్కటే. ఆ ప్రేమనే దైవస్వరూపం.

428068902

ప్రేమను ప్రేమతో తప్ప అన్యమార్గమునందు అనుభవించుటకు వీలుకాదు. ఇట్టి ప్రేమను ప్రేమతో కూర్చినదే భాగవతము.

ఇక కొంత సందేహం కలగవచ్చు. ఈ భాగవతమునందు ప్రేమతత్త్వము కలిగిన ఆస్తికులు మాత్రమే కాకుండా దివ్యత్వాన్ని విరోధపరచుకున్న నాస్తికులు కూడను వుంటున్నారే! హిరణ్యకశిపుడు, హిరణ్యాక్షుడు, కంస, దంతవక్త్ర, శిశుపాల ఇత్యాదిదుర్జనులు కూడను భాగవతంలో వుంటుండటంచేత కేవలం భక్తులకు భగవంతునికి మాత్రమే సంబంధబాంధవ్యమని చెప్పుటలో యేమాత్రం అర్థం లేదు కదా! దీనికొక చక్కని ఆదర్శము. ఎవరైనా మన యింటికొచ్చి దాహంచేత వారు అడిగినప్పుడు నీరో, లేక మజ్జిగో లేక జ్యూసో ఏదో ఒకటి మనం అందించాలి. అది అందించటానికి ఒక పాత్ర కావాలి. ఈ పాత్ర వెండిపాత్ర కావచ్చు లేక పింగాణి పాత్రగావచ్చు లేక ప్లాస్టిక్ పాత్రగావచ్చు. పాత్ర ప్రధానము కాదు. పదార్థము ప్రధానము. అదే విధముగనే ఈ హిరణ్యకశిపుడు, హిరణ్యాక్షుడు, కంసుడు శిశుపాలుడు, దంతవక్త్రుడు వీరందరు కూడను ఒక్కొక్క పాత్రగాయిందులో నిరూపించారు. ఈ పాత్రయందుండిన పదార్థతత్త్వాన్ని పరార్థంగా మార్చియదార్థమైన స్వరూపాన్ని నిరూపించటమే. దీనివల్ల చెడ్డ కూడను భాగవతమునందు చెప్పటానికి అవకాశము వుంటుండాది. నీదృష్టియందు వారు రాక్షసులు కావచ్చును. దైవదృష్టియందు వారు భక్తునకు సహాయకారులుగా నిలచవచ్చును. ఇట్టి రాక్షసులను ఆదర్శముగా తీసుకొనియే ఆత్మతత్త్వాన్ని భక్తులకందిస్తూ వచ్చాడు భగవంతుడు. Pleasure is an interval between two pains. రెండు చెడ్డల మధ్యనే ఒక మంచి యిమిడి వుంటుంటాది. నిజముగా యీ హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపులే లేకపోతే ప్రహ్లాదునికి నారసింహావతారము సాక్షాత్కరించటానికి అవకాశమే లేదు. అదే విధముగనే విరోధతత్త్వమే లేకపోతే విశ్వాసము బలపడటానికి వీలే వుండదు. పరమభక్తుడైన ప్రహ్లాదుని తండ్రియైన హిరణ్యకశిపుడు అనేక విధములుగా హింసించినప్పటికిని కష్టపెడపటికి అతని భక్తిప్రపత్తులు జగద్వ్యాప్తి గావటానికి యీ కష్టములే కారణము. హిరణ్యకశిపుడే కారణము. పరమభక్తుని పరమశాంతి సుఖములనందించే నిమిత్తమై యీ విధమైన విరోధతత్త్వములను, వ్యక్తులలో సృష్టించి తద్వారా వారియొక్క ఆస్తికత్వాన్ని బలపరుస్తూ వచ్చాడు భగవంతుడు. కట్టకు కట్టె రాపిడి జరిగినప్పుడు అగ్ని సాక్షాత్కరిస్తుంది. ఇందులో అగ్ని అంతర్గతంగా వుండినప్పటికిని యిది సాక్షాత్కరించాలంటే కట్టకట్టె రాపిడి జరగాలి. ఇతే నేడు కొంచెము, రేపు కొంచెము యీ విధంగా రాపిడి జరిగినప్పుడు కట్టెము కట్టై పోతుందే గాని అగ్ని ఆవిర్భవించదు. ఈ రాపిడి నిర్విరామముగా జరిగినప్పుడే ఇందులో అగ్ని వృద్ధిచెస్తుంది. నిరంతరము భగవన్నామము చేతనే మానవత్వమునందున్న జ్ఞానాగ్ని ప్రజ్వలిస్తుంది. భక్తులకు ఆనందమును సుఖమును అనుభూతిలో అందించే నిమిత్తమై యిలాంటి దుష్టులు పక్కలో వుండి తీరాలి. బిడ్డను పెంచి నష్టిస్తూ

ఆడిస్తూ ఆనందాన్ని అందించాలంటే తల్లికి పక్కలో బిస్కెట్లు, పిప్పరమెంట్లు, ఆటవస్తువులు అన్నీ పెట్టెలక్కేడ. ఈ ఆటవస్తువులు ఎందుకోసం పెట్టాలి? బిడ్డల యొక్క ఆనందము నిమిత్తమై. యీవస్తువులు పెట్టాలి. తల్లికి ఆవస్తువులతో యేమీ ప్రయోజనం లేదు. బిడ్డ ఏడిస్తే తల్లి సహించలేదు. బిడ్డను ఆనందపరచే నిమిత్తమై తల్లికి అవసరము కాని వస్తువులైనను బిడ్డలకందించి ఆబిడ్డను ఆనందపరుస్తుంది. అదే విధముగనే భక్తుని ఆనందపరచాలనుకున్నప్పుడు అతనిలో వృద్ధివించిన దివ్యత్వాన్ని ప్రకటింపజేయదలచినప్పుడు అతనికి యీ జగత్తు రూపమైన విరోధమైన పనికిమాలినవైనను అతని చుట్టూ పెట్టి తద్వారా దానిని బయటకి లాగాలి.

ఒక చిన్న ఉదాహరణము. చెరకులో పిప్పి లేకపోతే రసము నిలువలేదు. మనము తీసుకోవలసినది రసము. వదలవలసింది పిప్పి. ఈ రసము పిప్పితో కూడి వుంటుంది. ఈ పిప్పి మనకక్కరలేదు. కాని యీ పిప్పిద్వారానే యీరసము పొందాలి. అదే విధముగనే విరుద్ధమైన మార్గముల ద్వారానే యదార్థమైన దివ్యత్వాన్ని మనం అందుకోటానికి ప్రయత్నించాలి. ఏ చిన్న విషయమునందు కూడను కొన్ని రకములైన విరుద్ధములైన మార్గములనుసరించినప్పుడే యదార్థమైన తత్త్వము మనకర్థమవుతుంది. శరీరమునకు కసరత్తు చేయాలనుకున్నప్పుడు యీ శరీరమునకు మంచి పుష్టి, సంతుష్టి కలగాలంటే అనేక విధములగా శ్రమపెట్టాలి.

పిలిచి అడుగ చెరకు పెట్టినా బెల్లంబు
పిప్పిగొట్టి రసము పిల్చుకున్న.

జాతి వజ్రమైన సానబెట్టవలె. సానపెట్టకపోతే డైమండ్‌కు విలువ రాదు. కనుకనే దివ్యత్వమనేది సర్వుల యందు వుండినప్పటికిని ఒక్కొక్క వ్యక్తియందు బహిర్ముఖముగా గోచరిస్తుంది. బహిర్ముఖముగా గోచరించటానికి కారణమేమిటి? భక్తుని యందున్న భావము భగవంతుని యందున్న ప్రేమ రెండింటి యొక్క సన్నిహితమైన సంబంధమే యీ వ్యక్తిత్వం గావటానికి కారణం.

ప్రహ్లాదునకు నరసింహుడు ప్రత్యక్షం కావటానికి ఎవరు కారణం? ప్రహ్లాదుడా? హిరణ్యకశిపుడా? యిరువురు కారణమే. హిరణ్యకశిపుని యందున్న ప్రహ్లాదుని యందున్న విశ్వాస మనకు అక్కడ రెండింటికిని సాన జరిగింది. దేవుడు ఎక్కడ వున్నాడు అని హిరణ్యకశిపుడు ప్రశ్నించాడు. 'ఇందుగలడందు లేడని సందేహము వలదు' అని ప్రహ్లాదుడు జవాబు చెప్పాడు. ఐతే యీ స్తంభమునందున్నాడా? ఉన్నాడని చెప్పాడు ప్రహ్లాదుడు. అప్పుడు స్తంభాన్ని కొట్టాడు. అప్పుడే నరసింహుడు ప్రత్యక్షమయ్యాడు. కనుక యీ యిరువురి యొక్క సన్నిహిత సంబంధ బాంధవ్యములైన బోధముతో దీనికి మూలకారణములైనవి. అతని యందు ఆరూపములో, యితని యందు యీరూపములో వుంటున్నాడు భగవంతుడు. అనేది తానే అనిపించుకొనేటి

428068904

తానే. వర్ణించేది తానే దూషించేది తానే. అందుకొనేది తానే. అందించేదీ తానే. కనుక యీ ఏకత్వమనే తత్వాన్ని అర్థంచేసుకున్నప్పుడే సర్వం విష్ణుమయం జగత్తన్నది మనకర్థమవుతుంది.

జాగ్రత్ స్వప్న సుషుప్తులయందు మనం ఒకటిగానే వుంటున్నాం. జాగ్రత్తలో యీహాల్లో కూర్చుని మనం అన్నీ వింటున్నాం. స్వప్నావస్థలో యేదో ఒక దృశ్యాన్ని అనుభవిస్తున్నాం. ఈ దేహానికి ఆ స్వప్నమునకు సంబంధం లేదనుకుంటున్నాం. సుషుప్తిలో ఆనందాన్ని అనుభవిస్తున్నాము. అప్పుడు యీమనస్సు దేహము రెండూ లేదని అనుకుంటున్నాము. ఐతే అనుభవించిన వాడెవరు? సుషుప్తిలో ఆనందాన్ని అనుభవించినవాడూ తానే స్వప్నములో యీ పదార్థము యొక్క సంయోగాన్ని అనుభవించేది తానే. జాగ్రత్తలో యీ సమావేశంలో కూర్చొని ఆనందంగా శ్రవణం చేసేది తానే. ఐతే యిక్కడ శ్రవణం చేసింది దేహతత్వంలో యింద్రియములు. స్వప్నములో పదార్థ సంయోగము ననుభవించినది సూక్ష్మదేహమైన మనస్సు. ఇంక సుషుప్తిలోపల అనుభవించిన తత్వము యీ మనస్సుకు స్వాధీనము కాని ఒక అతీతమైన దివ్యత్వము. అవస్థలు మాత్రం వేరు కాని అనుభవించిన వ్యక్తి ఒక్కడే. కనుకనే భగవత్తత్వమనే దాన్ని అర్థం చేసుకోటం చాలా కష్టం. దానిపైన శ్రద్ధా భక్తులు వుండిన వారికే సులభమైన మార్గములో అనుభవించటానికి వీలౌతుంది.

ఒక్కొక్క సమయంలోపల యిదే భగవత్ శక్తి అనేక రూపములు ధరించూ వుంటుంది. భక్తుని యందు యిది జ్ఞానాగ్నిగా రూపొందుతుంది. ప్రకాశిస్తుంది. భక్తుడు కానివాని హృదయము నందు యిది క్రోధాగ్ని కామాగ్ని ద్వేషాగ్ని గా రూపొందుతుంది. అగ్ని అనేది చాలా భయంకరమైనది. అది దూరంగా వుండినప్పుడే మనకెంతో భయాన్ని కలిగిస్తుంది. భద్రతను లేకుండా చేస్తుంది. ఈ నాటి మానవులు యీ భయంకరమైన అగ్నిని హృదయమునందే పెట్టుకొని నిరంతరము భయభ్రాంతులకు గురౌతున్నారు. కామాగ్ని క్రోధాగ్ని, ద్వేషాగ్ని, అసూయాగ్ని అనేవి చాలా బాధించేవి. దీనినే రావణకాష్టము అన్నారు. అన్ని అగ్నులు ఆరుతాయి గాని యీ అగ్నులు సులభంగా ఆరేవి కావు. ఆరినట్లే కనుపిస్తాయి కాని తిరిగి ఎప్పుడు ప్రజ్వలిస్తాయో చెప్పటానికి వీలు కాదు. ఈ అగ్నులు చల్లార్చటానికి ఏది మనకు ఆధారము? ఏది కావాలి! అదియే వైరాగ్యము, ప్రేమ అనే వర్షమును కురిపించాలి. ఈ ప్రేమ వర్షము ద్వారానే నిజమైన శాంతి మనకేర్పడుతుంది.

ఈనాడు మానవులకు అనేక విధములైన సౌకర్యములు, సదుపాయములు, సుఖములు వుండినప్పటికి నిరంతరము భయభ్రాంతికి గురైపోతున్నాడు. ఎన్ని విధములైన భద్రములు ఏర్పరచుకున్నప్పటికిని అతని భయం పోవటం లేదు. ఎన్ని సదుపాయములుండినప్పటికిని అతడు శాంతి అనుభవించటం లేదు. ఈ శాంతి లేక పోవటానికి కారణం ఏమిటి? ఈ భయం కలగటానికి కారణం

428068905

ఏమిటి? వాని హృదయంలో యీ కామ క్రోధ, ద్వేషాగ్నులనేవి ప్రజ్వరిల్లుచుండటంచేత యింతటి భయము అశాంతిని అనుభవిస్తున్నాడు. శాంతిగా వుండటానికి శాశ్వతమైన సదుపాయములు సర్వము వున్నాయి కదా! ఎందుకు శాంతి అనుభవించకూడదు? ప్రాకృతమైన సుఖశాంతులకు యిది కాదు ఆధారము. పవిత్రమైన భావముతో శాంతికి మూలకారణము. ద్వేషము లేనివాడు నిరంతరము శాంతిగానే వుంటాడు. ద్వేషము కల్గినవానికే భయం ఆరంభమవుతుంది. భయమెప్పుడు ప్రవేశిస్తుందో అశాంతి సంభవిస్తుంది. దోషములు చెయ్యకుండా వుండినప్పుడే ఒక విధమైన శాంతి కలుగుతుంది. దోషరహితుడు అయినప్పుడే నీవు భయభ్రాంతుడు కాకుండా వుంటావు. దోషములు రాకుండా వుండటానికి యేమి చెయ్యాలి? దేని ననుసరించాలి? ఏది దోషమో, ఏది మంచిదో అది నిర్ణయించుకునే శక్తి సామర్థ్యములు మానవుని యందు లేవని భ్రమిస్తున్నారు. జగత్తునందున్న సమస్త ప్రాణికోటి కంటె మానవునికి మాత్రమే యిది దోషమా కాదా అని నిర్ణయించే శక్తి అధికంగా వుంటుండాది. అట్లు తెలిసి కూడను తాను దోషములోపల పడిపోతున్నాడు. దోషములని తెలిసికూడను దానినే అనుసరిస్తున్నాడు. కనుకనే అశాంతి భయము ఏర్పడుతుంటాయి. నిజంగా దోషమే తెలియకుండా వుంటే వీనికి అశాంతిగాని భయముగాని వుండటానికి వీలుకాదు. కొంతమంది పిచ్చివారుంటారు. discrimination power లేకుండా వుంటారు. వారు యిది మంచి యిది చెడ్డ అని నిర్ణయం చేయలేరు. ఏంచేసినప్పటికి అతనికి భయము వుండదు. కారణమేమిటి? discrimination power లేకపోవటం చేత వారు యేంచేసినా తప్పు లేదు. భయంలేదు. ఈ discrimination యీ విచారణాశక్తి యే మానవుని యందు వుంటుందో వారికి మాత్రమే భయం, అశాంతి. ఈ విచారణాశక్తిని సన్మార్గములో ప్రవేశపెట్టాలి. నీ కాన్షన్సు నీ ఆత్మతృప్తిగా నిన్ను రైట్ అన్నప్పుడు దాన్ని అనుసరించాలి. కాన్షన్సు కాదన్నప్పటికిని నీవు అనుసరిస్తున్నావు. కనుకనే భయము, అశాంతి అనుభవిస్తున్నావు.

విద్యార్థులారా! అనేకమంది దోషములు చేయటానికి కాని, అశాంతిని పొందటానికిగాని, భయము పొందటానికిగాని యిదే మూలకారణము. ఈ భయము దూరము చేసుకోవాలనుకున్నప్పుడు సర్వకర్మ భగవత్ప్రీత్యర్థం అంతా భగవంతునిదే. నాదేహము భగవంతునిదే సర్వము భగవంతునిదే అనే భావాన్నైనా మీరు విశ్వసించాలి. ఒక్కొక్క కట్టెలో అగ్ని వున్నట్లుగా దేహము ఒక కట్టెనే కనుక ఇందులో కూడను అగ్ని వుంటుంది. ఈ అగ్నిని సరియైన రీతిలో మనం వుపయోగపెట్టుకోవాలి. అగ్ని ఒకటే అయినప్పటికి ఒకటి చెడ్డ అగ్ని ఒకటి మంచి అగ్నిగా వుంటున్నది. స్మశానంలో ఒక శవాన్ని కాలుస్తున్నారు అక్కడా అగ్నే. అగ్ని వుంటుండాది అని దోశలు, ఇడ్లీలు మనం వేసుకుంటూ కూర్చుంటామా? ఆ అగ్నిని చెడ్డ అగ్నిగా

భావిస్తున్నాం. అది స్మశానాగ్ని. ఒక యజ్ఞం చేస్తున్నాము. అక్కడ కేశవాయ స్వాహా చేస్తున్నారు. అది కూడను అగ్నియే. ఆ అగ్నిని దేవుని సమానంగా చూస్తున్నారు. అగ్నిదేవుడు అంటున్నారు. మన యింటిలో వంట చేసుకుంటున్నాము. అదీ అగ్నే. కాని అది వంట చేసుకోటానికి మాత్రమే ఉపయోగపెడుతున్నాము. ఇంకొకరు సిగరెట్టు తాగుతున్నాడు అక్కడా అగ్నియే. కానీ ఆ అగ్నికి ఎవరైనా నమస్కరిస్తున్నారా? ఇంకొకడు జోదివత్తులు ముట్టిస్తున్నాడు. అదీ అగ్నే. ఈ ఊదొత్తులు భగవంతునికి చుట్టి తాను నమస్కరిస్తున్నాడు ఆదే విధంగానే అగ్ని ఒక్కటైనప్పటికిని వినియోగ విధానములు వేరువేరుగా వున్నాయి. కానీ దైవత్వం ఒక్కటే. దివ్యత్వం ఒక్కటే. ఉపయోగించుకునే విధానాన్ని బట్టి యీ వం బేధ్యలు రూపొందుతూ వున్నాయి.

భగవంతుడు అస్తి, భాతి, ప్రియం, రూపము, నామము అని ఐదు గుణములతో వుంటున్నారు. దీనినే సంస్కృతములో సత్ చిత్ ఆనందము రూపము నామము అన్నారు. రూపాలు, నామాలు మాత్రమే మనకు గోచరిస్తున్నాయి. కాని అస్తి భాతి ప్రియం సత్ చిత్ ఆనందము అనేది తెలియటం లేదు. ప్రతి పదార్ధము నందు కూడను సత్ చిత్ ఆనందము వుంటుండాది. ఈ టేబల్ లో కూడ సత్ చిత్ ఆనందము వుంది. ఈ మైక్ లోపల కూడా సత్ చిత్ ఆనందము వుంది. ఐతే సత్ చిత్ కనుపిస్తుండాది. కాని ఆనందము మనకు గోచరం కావటం లేదు. సత్ అనగా యిది వుంది. మైక్ వుంది. యిది కనిపిస్తుండాది. చిత్ వినిపిస్తుండాది. ఇవి రెండూ సత్యమే. కాని అది ఆనందిస్తుండాదా లేదా అనేది మాత్రం మనకు గోచరం కావటంలేదు. వీనిని మనం జడములు అంటున్నాం. ఇప్పుడు నరసింహన్ వుంటున్నాడిక్కడ. ఆయనకు సత్ చిత్ దేహము నామము రెండు వుంటున్నాయి. కానీ అతడి ఆనందము కూడను మనకు గోచరిస్తుండాది. స్వామియొక్క ఉపన్యాసము విని ఆనందిస్తున్నాడు. కనుకనే మానవుని యందు మాత్రమే ఆనందము గోచరమౌతుంది. ఇంక అన్నింటి యందు సత్ చిత్ వుందిగాని ఆనందం గోచరం కావటం లేదు. ప్రతి పదార్ధము నందు భగవత్స్వరూపమే వుంటుండాది. ఈ పదార్థమును పరార్థము గా మార్చటమే సాధన యొక్క లక్ష్యం. యీ divinity అనే దాన్ని ప్రేమతత్వంగా మనం భావించాలి. ప్రేమ లేకపోతే దివ్యత్వమనేది యేమాత్రము మనకర్థం కాదు. మనము అన్నింటిని క్రొత్తగా క్రొత్తగా చూసుకుంటూ పోతే మనకు యేమాత్రం అధికారం లభ్యము కాదు. మనము అధికారం లభ్యము కావాలనుకున్నప్పుడు ఒక హక్కును కూడను సంపాయించాలి. ఆ హక్కును సంపాయించుకున్నప్పుడే మనం అతన్ని మన సొంత రీతిగా వినియోగించుకుంటాం.

ఒక చిన్న ఉదాహరణము. ఒక కొత్త మిత్రుడే వచ్చినాడంటే లేక ఒక బంధువే వచ్చినాడంటే కుర్చీ వేసి, అన్నీ వేసి రండి దయచేయండి కూర్చోండి అని కాఫీ టిఫిన్ యిచ్చి మర్యాదగా అన్ని విధములుగా గౌరవిస్తాడు. ఈ గౌరవమర్యాదలు పొందేవాడు

428068907

ఎవడు? క్రొత్తవాడే. క్రొత్తవానికి మాత్రమే యీ respect అంతా. పాత మిత్రుడైతే రారా పోరా అని కూర్చుంటావు. వానితో యిష్టము వచ్చినట్లు మాట్లాడుతావు. చేయి బట్టి లాక్కొని వస్తావు. అక్కడ కీర్తి మర్యాదలు లేవు కాని అధికారమెక్కువగా వుంది. ఈ అధికారం చేతనే ప్రేమ కూడను స్వేచ్ఛగా వుంటూంటాది. కనుకనే స్వేచ్ఛ వుండినప్పుడే మనకు ప్రేమ కూడా వస్తుంది. స్వేచ్ఛ లేనంత వరకు ప్రేమ రావటానికి వీలు లేదు. స్వేచ్ఛ కావాలంటే ఏమి చెయ్యాలి. అర్పితము కావాలి. నా నే అనే రెండూ రాకూడదు. నేను. నేను నేను అనేది ఏనాడు వాయువై పోతుందో అదే వేదాంతమన్నారు. నేను అనేది లేకుండా పోవాలి. ఈ నేను అనేది కాకుండా అంతా నీవే అనే స్థితికి రావాలి. ఎందుకంటే జగత్తంతా వున్నది నీవే. కనిపించినా కనిపించక పోయినా నీవే. కరెంటు అన్ని వైపులా వుంటుండాది. స్విచ్ ఆఫ్ చేసినప్పుడు కనుపించదు. కనుపించకుండా పోయినంత మాత్రమున లేదని చెప్పటానికి వీలు కాదు. స్విచ్ ఆన్ చేస్తే కనిపిస్తుంది. కనుక స్విచ్ ఆన్ చెయ్యటము ఆఫ్ చెయ్యటము నీలో వున్న ప్రయత్న దోషమే గాని భగవంతుడు సర్వత్రా వుంటున్నాడు. అజ్ఞాన వశము చేత నీవు దీనిని స్విచ్ ఆన్ చెయ్యకుండా లైటు లేదు లైటు లేదు అని చెప్పి భ్రమిస్తున్నావు. ఏదైనా ఒక దోషము వుండాలి. లేక యీ లైటు రాకుండా వుండటానికి మరొక కారణము వుంటుండాలి. వీనికన్నిటికి కూడను మెయిన్ స్విచ్ వేరే వుంటుండాది. ఈ main switch ఆఫ్ చేసి రూములు రూములల్లోనా లైట్లు వేస్తే లైట్లు రావు. ఆ main switch అనేది ఏమిటి? అదే దివ్యమైన ప్రేమ. ప్రేమ అనే స్విచ్ వేస్తే అన్ని అంగములయందు కూడను ప్రేమ ప్రారంభమౌతుంది. మాటల్లో ప్రేమ మాటలొస్తాయి. చేతల్లో ప్రేమ పనులు చేస్తావు. హృదయములో ప్రేమ భావములు అభివృద్ధి అవుతాయి. కన్నుల్లో ప్రేమ దృష్టి వస్తుంది. చెవుల్లో ప్రేమ విషయాలు శ్రవణం చేస్తావు. అన్ని అంగముల యందు ప్రేమ అనే ప్రకాశమే వెలువడుతుంది. ఆ ప్రేమ లేకుండా కేవలము స్వార్థము స్వప్రయోజనము నిమిత్తమై మనము ప్రాకులాడినప్పుడు అన్ని అంగములు అంధకారమును పొందుతాయి. కనుకనే ప్రేమ యే ప్రధానమైనది. మన హృదయంలో ప్రేమను పెంచాలి. మన అంగములలో ప్రేమను వికసింప చెయ్యాలి. ప్రేమ జీవితాన్ని మనము అభివృద్ధి గావించుకోవాలి. ప్రేమతోనే ప్రేమను చేర్చుకోవాలి. కనుకనే గోపికలందరు కృష్ణుని అదే కోరారుట.

ప్రేమ రహిత మరు భూములలో ప్రేమాంకురములు పెంపొంద
ప్రేమావేశములో ప్రేమ సుధా వర్షము వర్షింపగ
ప్రేమ నదులు ప్రవహింపగ మురళి
గానము సేయగదే కృష్ణా గానము సేయగదే.

ప్రేమ రహిత మరు భూములివన్నీ. ఎండ బారిన బండ భూములివన్నీ. ఒక విధమైన బీడు భూములు, ప్రేమ అనే బీజములతో దున్నో నాటాలి. నీ గానము ఎట్లా వుండాలంటే

428068908

అంత ప్రేమమయంగా వుండాలి. ఈ ప్రేమ ఎప్పుడొస్తుంది? ఆనంద సమయములోనే యీ ప్రేమ వస్తుంది.

ప్రేమ వుండినప్పుడే ఆనందము వస్తుంది. ఆనందంగా వుండినప్పుడే గానం పాడతావు. మీరు నిత్య జీవితంలో చక్కగా గుర్తుంచుకోండి. నీవు చక్కగా ఆనందముగా వున్నావంటే నననా నననా ఏదో పాటలు పాడుకుంటూ వుంటావు. ఆ ఆనందములోనే నీకు సంగీతమొస్తుంది. కాని దుఃఖములో సంగీతము రాదు. బాత్ రూమ్‌లోనైనా నీవు పాడుకుంటూ వుంటావు. ఎక్కడైనా సరే యీ ఆనందమనేది ఎప్పుడొస్తుంది? ఆనంద సమయములోనే సంగీతం ప్రారంభమవుతుంది. రుద్రభూమి, భద్రభూమి రెండింటి యందు కూడను గానం చేసినవాడు కృష్ణుడు. యుద్ధభూమిలో కూడను గానం చేశాడు. అందుకోసమే భగవద్గీత అన్నారు. ఈ battlefield లోపల నీకు మాత్రం భయం వుండవచ్చును. ఏమవుతుందో ఎవరు చంపుతారో అనే భయము వుండవచ్చు. కానీ కృష్ణునికి భయంలేదు. భగవంతునికి నో భయం. నో ఫియర్. కనుకనే చెప్పాడు. Be fearless I am with you అన్నాడు. భగవంతుడు వెంటవున్నప్పుడు యింక fear కు అవకాశమే లేదు. నీవే భగవంతుడైనప్పుడు యింకే fear ఎందుకు రావాలి? భగవంతుడు లేని హృదయం కాదు కదా! ఆ భావములో నీవు fearless గా వుండు. యిదే యీనాడు మనం సంపాయించుకోవలసిన ఆనందము. ఇదే యీనాడు మనం పోషించుకోవలసిన ఆనందం. యిదే యీనాడు మనం నిల్పుకోవలసిన ఆనందం. ఇది లేకపోతే ఏమీ Joy వుండదింక. Ice cream joy మాత్రం వుంటుంది. కనుక యీ విధమైన ఆనందాన్ని అనుభవించేనిమిత్తమై భగవత్ప్రేమను పొందాలి. ఈ ప్రేమ ప్రేమ చేతనే తప్ప అన్యమార్గములో మనకు లభ్యం కాదు. విద్యార్థులారా! నిజంగా మానవుని జీవితము చాలా అదృష్టవంతమైన జీవితము. పవిత్రమైన జీవితము. జీవించవలసిన జీవితము, గౌరవించవలసిన జీవితము. అలాంటి మానవ జీవితాన్ని యీనాడు మనము మాణిక్యమును మసి బొగ్గులకు అమ్ముకున్నట్లుగా విషయవాసనలంతా కమ్ముకొని వ్యర్థం గావించుకుంటున్నాము.